సాక్షి రంగారెడ్డి

శనివారం ౹ 25 ౹ మార్చి ౹ 2023



క్షయపై అవగాహన అవసరం

క్షయపై అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి సోకిన వారు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి అన్నారు. 8లో▸



ప్రైవేటీకరణపై ఉద్యమిద్దాం

కేంద్రం చేపడుతున్న ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేద్దామని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు పిలుపునిచ్చారు. 8లో▸

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌టౌన్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఉష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలను ఫోన్‌ద్వారా వివరించాలని కోరారు. సమస్యలను తెలిపేందుకు 99592 26287 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



న్యూస్‌రీల్

ప్రజలకు నిరంతర సేవలు



డీసీపీ, ఏసీపీ కార్యాలయాలను ప్రారంభిస్తున్న డీసీపీ శ్రీనివాస్

తుక్కుగూడ: డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉండి నిరంతరం సేవలు అందిస్తామని మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని ఓ ప్రైవేటు భవనంలో ఏర్పాటు చేసిన ఏసీపీ, డీసీపీ కార్యాలయాలను శుక్రవారం ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మరికొన్ని పోలీస్ స్టేషన్లకు అందుబాటులో ఉండేలా ఈ కార్యాలయాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రభుత్వం నూతన భవనం నిర్మించే వరకు ఇక్కడి నుంచి సేవలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏసీపీ అంజయ్య, సీఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే టీబీ నివారణ



పౌష్టికాహార కిట్ల పంపిణీ

హుడాకాంప్లెక్స్: మందులతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే క్షయ వ్యాధిని నివారించవచ్చని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి రాఘవరెడ్డి అన్నారు. ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. టీబీ నివారణకు స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీఓలు, ప్రైవేటు రంగ సంస్థలు కృషి చేయాలని, బాధితులకు సహకారం అందించాలని కోరారు. రెండు వారాలు దగ్గు, జ్వరం ఉండటం, రాత్రివేళల్లో చెమటలు పట్టడంతో పాటు బరువు తగ్గడం వంటి లక్షణాలు గుర్తించి చికిత్స అందజేస్తారని వివరించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, శైలేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తపాలా పథకాలను సద్వినియోగం చేసుకోండి



రోడ్డు షో నిర్వహిస్తున్న తపాలా సిబ్బంది

షాద్‌నగర్: తపాలా శాఖ అందిస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి జిల్లా తపాలా శాఖ సూపరింటెండెంట్ దేవిరెడ్డి సిద్ధార్థ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని పోస్టాఫీస్‌లో గ్రామీణబ్రాంచ్ పోస్టు మాస్టర్లు, అసిస్టెంట్ పోస్టమాస్టర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపాలా శాఖ ప్రవేశపెట్టిన బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు భారత ప్రభుత్వ తపాలా శాఖ జీవిత బీమాతో పాటు సంక్షేమ పథకాలు అందిస్తోందని అన్నారు. సురక్ష, సువిత, సమంగల్, వంటి అనేక పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఏ పోస్టాఫీస్‌లోనైనా సులభంగా ప్రీమియం చెల్లించే సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు చేసుకోవచ్చని అన్నారు. ఆదాయ పన్ను రాయితీ, నామినేషన్, రుణ సౌకర్యాన్ని సైతం తపాలాశాఖ నుంచి పొందొచ్చన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వీధుల్లో తపాలాశాఖ వారు రోడ్డు షో నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జుబేర్, మేనేజర్ గోరక్‌నాథ్, శివాజీ, వెంకటేశం, ప్రభు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి గిఫ్ట్ ప్యాక్ ఇస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సతీమణి భారతి రెడ్డి

ఆత్మీయ సమ్మేళనం

సాక్షి దినపత్రిక 15వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం బంజారాహిల్స్‌లోని సాక్షి దినపత్రిక కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతీరెడ్డి కార్యక్రమంలో పాల్గొని సాక్షి ఉద్యోగులు, సిబ్బందిని అభినందించారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా వైఎస్‌భారతి కేన్సర్ బాధిత చిన్నారులను కలిసి ఆప్యాయంగా ముచ్చటించారు. కేన్సర్ చికిత్స పొందుతున్న బాలలకు అన్ని రకాలుగా ఉచిత సేవలు అందిస్తున్న బంజారాహిల్స్‌లోని సెయింట్ జ్యూడ్ ఇండియా చైల్డ్‌కేర్ సెంటర్ చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



సాక్షి దినపత్రిక 15 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక సిల్వర్ కాయిన్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్ భారతీ రెడ్డి

రేషన్.. ఉండదిక పరేషాన్!

- వలసదారులకు ఉపయుక్తంగా 'మేరా రేషన్ యాప్'
- యాప్‌లో దుకాణం, సరుకుల వివరాలు
- దేశంలో ఎక్కడినుంచైనా తీసుకునే వీలు
- అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు అవకాశం



రేషన్ దుకాణంలో సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

కొత్తూరు: ఉపాధి కోసం చాలామంది సొంత రాష్ట్రాలను వదిలి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తుంటారు. వెళ్లిన చోట ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ సరుకులు తీసుకునేందుకు అవకాశం లేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఈ క్రమంలో ఇలాంటి సమస్యలను అధిగమించడంతో పాటు రేషన్ సరుకుల పంపిణీలో మరింత పారదర్శకత ఉండేలా కేంద్రప్రభుత్వం 'వన్ నేషన్–వన్ రేషన్'లో భాగంగా 'మేరా రేషన్ యాప్'ను ఆవిష్కరించింది. ఇందులో దేశవ్యాప్తంగా కొనసాగుతున్న రేషన్ దుకాణాలు.. సరుకులు తదితర వివరాలను అందుబాటులో ఉంచింది. ఈ యాప్ ద్వారా వలసదారులకు తాము నివాసం ఉన్నచోట కూడా రేషన్ సరుకులు తీసుకునేందుకు వీలు కల్పించింది. ప్రస్తుతం ఈ యాప్ గూగుల్ ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో మొత్తం గ్రామాలు:	558
మున్సిపాలిటీలు:	14
కార్పొరేషన్లు:	02
మొత్తం రేషన్ దుకాణాలు:	919
ఆహార భద్రత కార్డుదారులు:	5,24,074
అంత్యోదయ కార్డుదారులు:	34,748
అన్నపూర్ణ కార్డుదారులు:	40
మొత్తం లబ్ధిదారులు: సుమారు 18,26,523 లక్షల మంది	
ప్రతీనెల పంపిణీ చేసే బియ్యం: 10 వేల మెట్రిక్ టన్నులు	

అక్రమాలు అరికట్టేందుకు..

జిల్లాలో 23 లక్షల కార్డుదారులకు గాను 456 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. వీరంతా ప్రతినెలా ప్రభుత్వానికి డీడీలు చెల్లిస్తే దుకాణాలకు సరకులు అందుతాయి. వాటిని డీలర్లు కార్డుదారులకు పంపిణీ చేస్తారు. రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలను అరికట్టడానికి ప్రభుత్వం సరుకులు తీసుకునేందుకు వచ్చే లబ్ధిదారుడి ఫోన్‌కు ఓటీపీ లేదా ఐరిస్ విధానాన్ని అమలు చేస్తోంది. దీంతో సరుకులు తీసుకునేందుకు కచ్చితంగా లబ్ధిదారుడే రావాల్సి ఉంటుంది.

మేరా రేషన్ యాప్ సేవలు..

- ఏ రాష్ట్రానికి చెందిన లబ్ధిదారుడైనా దేశంలో తాను వలస వెళ్లిన ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వ రేషన్ దుకాణంలో సరుకులు తీసుకోవచ్చు.
- మొదటగా లబ్ధిదారుడు తమ రేషన్‌కార్డుకు తన ఆధార్‌కార్డును అనుసంధానం చేసుకోవాలి.
- కొత్త ప్రాంతాల్లో రేషన్ దుకాణాల వివరాల గురించి ఎవరినీ అడగాల్సిన అవసరం లేకుండానే యాప్‌లో అన్ని వివరాలు ఉంటాయి.
- రేషన్‌కార్డు ద్వారా ఇటీవల జరిపిన లావాదేవీలు, గడిచిన ఆరునెలల్లో లబ్ధిదారుడు ఏ దుకాణంలో ఏఏ సరుకులు తీసుకున్నారో వివరాలు నమోదు చేస్తారు.
- కొన్నిచోట్ల లబ్ధిదారుడు సరుకులు తీసుకోకున్నా తీసుకున్నట్లు చూపితే యాప్‌ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది.
- రేషన్ డీలర్లు సమయపాలన పాటించకున్నా, అక్రమాలకు పాల్పడినా వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

స్థానికంగా సరుకులు



వన్ నేషన్ వన్ రేషన్‌లో భాగంగా 'మేరా రేషన్ యాప్' ద్వారా మొదట్లో ఆయా రాష్ట్రాలకు చెందిన లబ్ధిదారులకు స్థానికంగా రేషన్ సరుకులు ఇచ్చాం. ప్రస్తుతం కొన్నిచోట్ల యాప్‌లో ఆధార్‌కార్డు నంబర్‌తో వివరాలు నమోదవుతున్నా.. మరికొన్ని చోట్ల పలు కారణాలతో కార్డుదారుల వివరాలు రావడం లేదు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– కడెంపల్లి భాస్కర్, రేషన్ డీలర్, కొత్తూరు

ప్రజాస్వామ్యం అపహాస్యం

- ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం
- తప్పుడు కేసులతో తప్పుదోవ
- వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదు
- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి
- రాహుల్‌గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ మౌన దీక్ష

మీర్‌పేట: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ ప్రజాస్వామ్యాన్ని తప్పుదోవ పట్టిస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మండిపడ్డారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ శుక్రవారం మీర్‌పేట చందన చెరువు కట్టపై మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మౌనదీక్ష చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే మోదీ కక్షపూరితంగా ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్‌గాంధీ అడిగిన ప్రశ్నల్లో ఏ ఒక్కదానికీ సరైన సమాధానం చెప్పకుండా దాటవేశారని గుర్తు చేశారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. అనంతరం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఎల్మేటి అమరేందర్‌రెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు బాబు, మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, పుట్టగళ్ల జగన్, ఆల శ్రీనివాస్‌రెడ్డి, సుభాన్‌యాదవ్, కీసర యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మౌన దీక్షలో కాంగ్రెస్ నాయకులు

నెలాఖరులోగా పట్టాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరీశ్ ఇతర అధికారులు

కలెక్టర్ హరీశ్

సాక్షి,రంగారెడ్డిజిల్లా: జీఓ నంబర్ 58, 59, 76, 118 కింద అందిన దరఖాస్తులను నెలాఖరులోగా పరిశీలించి, ఎంపిక చేసిన లబ్ధిదారులకు పట్టాలు అందజేయనున్నట్లు కలెక్టర్ హరీశ్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం సీఎస్ శాంతకుమారి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో దరఖాస్తుల పరిశీలన, పట్టాల పంపిణీ లో కొంత జాప్యం జరిగిందని, ఈ ప్రక్రియను తక్షణమే ప్రారంభిస్తామన్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు జిల్లాలో సజావుగా సాగుతున్నాయన్నారు. ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా నుంచి 49,574 మంది రెగ్యులర్, 729 మంది సప్లిమెంటరీ విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 226 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశామని, ప్రశ్నాపత్రాల స్టోరేజీ కోసం 34 కేంద్రాలను ఎంపిక చేశామని సీఎస్‌కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ప్రతీక్‌జైన్, తిరుపతిరావు, జిల్లా ఇంటర్‌బోర్డు అధికారి వెంక్యానాయక్, డీఈఓ సుశీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుకు సీపీఆర్‌తో చెక్



సీపీఆర్‌పై అవగాహన

కలెక్టరేట్‌లో పోలీసు సిబ్బందికి శిక్షణ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గుండెపోటుకు సీపీఆర్‌తో చెక్ పెట్టొచ్చని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో పోలీసు సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి, శరీరానికి కనీస వ్యాయామం లేకపోవడంతో అనేక మంది చిన్న వయసులోనే గుండెపోటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుండెపోటుకు గురైన వారికి వైద్యుడి కోసం ఎదురు చూడకుండా వెంటనే సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడొచ్చని సూచించారు. ఎవరైనా గుండెపోటుకు గురైతే వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేయడం ద్వారా ఒక నిండు జీవితాన్ని, ఓ కుటుంబాన్ని కాపాడొచ్చని పేర్కొన్నారు. కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ.. వయసుతో నిమిత్తం లేకుండా అనేక మంది గుండెపోటుకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చాలా మందికి సీపీఆర్‌పై అవగాహన ఉన్నప్పటికీ.. శిక్షణ లేకపోవడంతో వెనుకాడుతున్నారని చెప్పారు. ఇటీవల నగరంలో ఓ కానిస్టేబుల్ సీపీఆర్ ద్వారా ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడారని, అదే స్ఫూర్తిని అంతా కొనసాగించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ చైర్ పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీలు ఎగ్గే మల్లేశం, దయానంద్, అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస దీక్షలు షురూ

సాక్షి, సిటీబ్యూరో: రంజాన్ మాసం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. తెల్లవారు జామున 4.55 గంటలకు ముస్లింలు సహర్‌తో ఉపవాస దీక్షలు ప్రారంభించారు. సాయంత్రం 6.34 గంటలకు ఇఫ్తార్‌తో ఉపవాస దీక్ష విరమించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదుమార్లు నమాజ్‌లు, రాత్రి తరావీ నమాజులు పూర్తి చేశారు. రంజాన్ మాసం ప్రారంభంతో ముస్లింలు నివసించే ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఇటు మసీదులతో పాటు వ్యాపార సంస్థలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. వ్యాపార కేంద్రాలన్నీ వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి.

ఉరుకులు.. పరుగులు

- ఓయూలో విద్యార్థుల ఆందోళనకు పిలుపు
- జూబ్లీహిల్స్‌లో రేవంత్‌రెడ్డి హౌస్ అరెస్టు
- ఖైరతాబాద్‌లో విద్యుత్ సౌధ ముట్టడి
- ఉత్కంఠతో గడిపిన పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగానికి శుక్రవారం ఆద్యంతం టెన్షన్..టెన్షన్‌తో గడిచింది. ఓయూ, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్‌లో చోటు చేసుకున్న పరిణామాలతో సిబ్బంది, అధికారులు తీవ్ర ఉత్కంఠతతో గడిపారు. శాంతిభద్రతల విభాగం పోలీసులే కాదు..ట్రాఫిక్ వింగ్‌కు కూడా బిజీబిజీగానే గడిచింది. పరీక్ష పేపర్ల లీకేజీతో పాటు టీఎస్‌పీఎస్సీలోని ఇతర పరిణామాలను నిరసిస్తూ విద్యార్థులు, నిరుద్యోగులు శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు ఉస్మానియా యూనివర్సిటీలో మహా నిరసన దీక్షకు పూనుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఉదయం నుంచి క్యాంపస్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. నిరసనకారుల నినాదాలు, ముందస్తు–అరెస్టులు, వాగ్వాదాలతో యూనివర్సిటీ దద్దరిల్లింది. ఓయూ నుంచి గన్‌పార్క్ చేయతలపెట్టిన నిరుద్యోగుల మార్చ్‌ను పోలీసులు అడ్డుకుని పలువురిని అరెస్ట్ చేశారు. వర్సిటీలోకి కొత్త వారి రాకపోకలను నియంత్రించిన పోలీసులు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఓయూ జరిగే నిరసన దీక్షకు సంఘీభావం తెలపడానికి తాను వెళ్తున్నట్లు రేవంత్‌రెడ్డి గురువారమే ప్రకటించారు. దీంతో ఆయన్ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆయన ఇంటి సమీపంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి భారీ ఎత్తున అదనపు బలగాలను మోహరించారు.

విద్యుత్ సౌధ వద్ద కలకలం

తమ డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ దాదాపు పది వేల మంది విద్యుత్ ఉద్యోగులు ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌధను ముట్టడించారు. ఈ నిరసన నేపథ్యంలో ఖైరతాబాద్ కేంద్రంగా పంజగుట్ట, లక్డీకాపూల్, రాజ్‌భవన్, ఎన్టీఆర్ మార్గ్, ఐమ్యాక్స్, మాసబ్‌ట్యాంక్...ఇలా అనేక మార్గాల్లో పెద్ద ఎత్తున వాహనాలు ఆగిపోయాయి. ఈ ట్రాఫిక్ జామ్స్ క్లియర్ కావడానికి దాదాపు నాలుగు గంటల సమయం పట్టింది. ఈ పరిస్థితులకు తోడు శుక్రవారం ప్రార్థనల బందోబస్తు నేపథ్యంలో పోలీసులు రోజంతా తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

షాద్‌నగర్‌రూరల్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని లింగారెడ్డిగూడలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం తీగలపల్లికి చెందిన పిచ్చకంట్ల కృష్ణయ్య(33)కు ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లికి చెందిన లక్ష్మితో 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొంత కాలం సాఫీగా సాగినా వీరి కాపురంతో గొడవలు మొదలయ్యాయి. తరచూ భార్య లక్ష్మిని వేధిస్తుండటంతో తన ఇద్దరి పిల్లలను తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లింది. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన కృష్ణయ్య గురువారం రాత్రి లింగారెడ్డిగూడ గ్రామ శివారులో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. షాద్‌నగర్ స్టేషన్ మాస్టర్ మనోహర్ ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్‌ఐ అక్బర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఎస్‌ఐ అక్బర్ తెలిపారు.


కృష్ణయ్య మృతదేహం

కుక్కల దాడిలో పది జీవాలు మృతి

యజమానికి గాయాలు

కేశంపేట: గొర్రెలు, మేకల మందతో పాటు యజమానిపైనా కుక్కలు దాడి చేసిన ఘటన మండల పరిధిలోని చింతకుంటపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనమోని వెంకటయ్య వ్యవసాయ పొలంలో రోజు మాదిరిగానే గొర్రెలు, మేకల మందను నెట్‌షెడ్‌లో ఉంచారు. శుక్రవారం ఉదయం కుక్కలు దాడికి పాల్పడటంతో 10 జీవాలు మృతి చెందాయి. యజమానిపైనా దాడికి దిగడంతో గాయాలయ్యాయి. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.


మృతి చెందిన జీవాలు

వ్యక్తి అదృశ్యం

కందుకూరు: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కొండల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని సరస్వతీగూడకు చెందిన గుల్వి జంగయ్య(45) గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో శుక్రవారం అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిస్తే 94906 17237కు సమాచారం అందించాలన్నారు.


జంగయ్య (ఫైల్)

ముగ్గురిపై కేసు

పరిగి: పేకాట ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. భర్కత్‌పల్లి సమీపంలో శుక్రవారం కొంత మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. వడ్ల శ్రీనివాస్, నర్సింహులు, కృష్ణయ్యను పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.3,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

భగ్గుమన్న కాంగ్రెస్

- రాహుల్ అనర్హత వేటుపై నిరసన
- మోదీ చిత్రపటాల దహనం


బడంగ్‌పేటలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు


కందుకూరు చౌరస్తాలో మోదీ చిత్రపటంతో కాంగ్రెస్ నాయకుల నిరసన

బడంగ్‌పేట్: మోదీ ప్రభుత్వం రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడంతో బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున బడంగ్‌పేట చౌరస్తాకు చేరుకొని ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మేయర్ పారిజాత మాట్లాడుతూ.. కాబోయే భావిభారత ప్రధాని రాహుల్‌ను కావాలనే బీజేపీ ప్రభుత్వం అనర్హత వేటు వేసిందని దుయ్యబట్టారు. అరాచక, మతతత్వ బీజేపీకి ప్రజలే బుద్ధిచెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు వి.ప్రభాకర్ రెడ్డి, దర్శన్‌రెడ్డి, బాలునాయక్, ఎర్ర జైహింద్, యూత్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, సుభాన్‌యాదవ్, ప్రతాప్‌రెడ్డి, మల్లారెడ్డి, బి.వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటం దహనం

కందుకూరు: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు వెంకటేశ్‌గౌడ్, ఎండీ అఫ్జల్ బేగ్ మాట్లాడుతూ.. ఆర్థిక నేరస్తులను శిక్షించకుండా బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ, అవినీతిపై ప్రశ్నిస్తున్న రాహుల్‌పై కేసు పెట్టి శిక్షించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి తల్లోజు వినోద్‌చారి, కాంగ్రెస్ నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, బి.ప్రశాంత్‌కుమార్, ఎస్.రాంరెడ్డి, జగదీశ్, రాజశేఖర్‌రెడ్డి, నయీమ్, ఫయాజ్, రాజ్‌కుమార్, అయ్యప్ప, సైదవాలి, నవీన్‌కుమార్, ఏలేటి ప్రభు, ఎండీ సల్మాన్, కుమార్, తరుణ్, శివాజీ, రవి, చంటి, శ్రీధర్, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

అందరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- కొండపోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపూర్‌లో నూతనంగా నిర్మించిన కొండపోచమ్మ దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం నిర్మించిన దాత భానూరి కృష్ణను అభినందించారు. సొంత ఖర్చులతో ఆలయాన్ని నిర్మించడం సంతోషకరమైన విషయమని, ఆయన భక్తిభావానికి నిదర్శనమని అన్నారు. గ్రామాల్లో దేవాలయల వల్ల ప్రజలకు మానసిక ప్రశాంతత లభిస్తోందని చెప్పారు. ప్రత్యేక పూజల్లో గ్రామ పెద్దలు, మండల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సాత విజయలక్ష్మి, జెడ్పీటీసీ గోవిందమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్‌పాపారావు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

కులమతాలకు అతీతంగా ..

మొయినాబాద్‌రూరల్: పండుగలను అందరు కలిసి ఉత్సాహంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ మసీద్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ పండుగలను కులమతాలకు అతీతంగా నిర్వహించాలన్నారు. ఈ ఇఫ్తార్ విందులో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దారెడ్డి వెంకట్ రెడ్డి, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవియాదవ్, మాజీ ఎంపీపీ శ్రీహరియాదవ్, ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.


శంకర్‌పల్లి: కొండపోచమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను నిర్మిద్దామని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు పిలుపునిచ్చారు. షాద్‌నగర్ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించిన కుర్మయ్య 5వ వర్ధంతిని శుక్రవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి రవిందర్ రెడ్డి ఆధ్వర్యంలో కుర్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ, అంబానీవంటి కార్పొరేట్ వ్యక్తులకు కట్ట బెడుతోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ రంగాలకు అప్పగిస్తూ ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కామ్రేడ్ కుర్మయ్య ఎంతో కృషి చేశారని అన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజించడంతో కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. కార్మిక చట్టాల రక్షణకై ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించే మజ్దూర్ కిసాన్ సంఘర్షణ ర్యాలీకి కార్మికులు అధిక సంఖ్యలో తరలివెళ్లి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసనసాయిబాబు, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు పండరి, లింగం, నజీర్, వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనునాయక్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయక్, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి నరహరి

షాద్‌నగర్: ప్రజలందరూ క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇంద్రానగర్ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. క్షయ వ్యాధి వచ్చిన వారు దగ్గినా, తుమ్మినా, నోటి ద్వార తుంపర్లు గాలిలో కలుస్తాయని అన్నారు. ఆ గాలికి పీల్చిన వారికి వ్యాధి సోకే అవకాశాలు ఉన్నాయన్నారు. వ్యాధి సోకిన వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చేతి రుమాలు అడ్డుపెట్టుకొని దగ్గడం, తుమ్మడం చేయాలన్నారు. ప్రభుత్వం క్షయ వ్యాధి నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.500, మందులు ఉచితంగా అందజేస్తుందని అన్నారు. వైద్యులను సంప్రదించి తగిన చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు,డాక్టర్ రమాదేవి, సిబ్బంది రవికుమార్, చంద్రకళ, శ్రీరామ, తుకారం, భారతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

- డాట్ సెంటర్ సమన్వయకర్త శాస్త్రవేత్త శేఖర్

ఇబ్రహీంపట్నం రూరల్: ఇటీవల కురిసిన వడగళ్ల వాన వల్ల రైతులు తగిన జాగ్రత్తలు వహించాలని డాట్ సెంటర్ సమన్వయ కర్త శాస్త్రవేత్త కె.శేఖర్ సూచించారు. వివిధ ప్రాంతాల్లో పంటలను పరిశీలించారు. ముందుజాగ్రత్తగా యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ప్రధాన పంట వరిలో వర్షపు నీటిని తీసివేసి సిఫారసు చేసిన మోతాదులో యూరియా వేసుకోవాలని చెప్పారు. అలాగే వరిలో తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున ప్రాపికోనజోల్ మందును ఒక లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలన్నారు. పూత దశలో ఉన్న మొక్క జొన్న పంటలో సుమారు 20 కేజీల యూరియా, 10 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చొప్పున కలిసి ఎకరానికి వేయాలని సూచించారు. రైతులు ఈ యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటలు కాపా డుకోవచ్చని చెప్పారు.


పంటలు పరిశీలిస్తున్న డాట్ సెంటర్ సమన్వయకర్త శాస్త్రవేత్త శేఖర్

